క్లుప్తంగా

ట్రైనీ ఎస్‌ఐగా సుధీర్‌రెడ్డి



బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ట్రైనీ ఎస్‌ఐగా సుధీర్‌రెడ్డి విధులను నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు తెలిపారు. మూడు నెలలపాటు వివిధ అంశాలపై సుధీర్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌లో శిక్షణ పొందుతారన్నారు. ట్రైనింగ్ తర్వాత ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరిస్తారని ఎస్‌ఐ పేర్కొన్నారు.

రెగ్యులరైజేషన్‌కు మరో అవకాశం

శ్రీకాళహస్తి: అనధికార లేఔట్లను రెగ్యులరైజేషన్ చేసుకోవడానికి మరో అవకాశం ఇస్తున్నట్లు పురపాలక సంఘ కమిషనర్ సంజీవకుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లేఔట్ రెగ్యులరైజేషన్, పీనలైజేషన్‌కు సంబంధించి గతంలో జారీ చేసిన జీఓ 10ని సవరిస్తూ తాజాగా జీఓ నంబర్ 134ను విడుదల చేసిందని తెలిపారు. అక్టోబర్ 24లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

మహాసభను జయప్రదం చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ: సూళ్లూరుపేటలో ఆగస్టు 4, 5 తేదీల్లో జరగనున్న సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని మండల సీపీఐ కార్యదర్శి కత్తిధర్మయ్య తెలిపారు. ఆయన మంగళవారం కారణిమిట్ట గ్రామంలో జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు వీరాస్వామి, రమణయ్య, చొక్కలింగం, సుబ్రమణ్యం, రాఘవయ్య పాల్గొన్నారు.

మహాకుంభాభిషేకం నిర్వహించండి



లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద అంజూరు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద ఉన్న భక్తకన్నప్ప కొండపై ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి మహాకుంభాభిషేకం నిర్వహించాలని మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు కోరారు. మంగళవారం ఆయన ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గతంలో తాను ధర్మకర్తల మండలి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు భక్త కన్నప్ప కొండపైకి దారిలో కొండపైన వెలిసి ఉండే లక్ష్మీనరసింహస్వామి, దుర్గాదేవి, శివసుబ్రహ్మణ్యం, గణపతి ఆలయాలకు బాలాలయం చేసి తిరిగి పునర్నిర్మించినట్లు తెలిపారు. నెలలు గడుస్తున్నా మహాకుంభాభిషేకం జరగకుండా ఆలస్యం చేస్తున్నారని, వెంటనే ఆలయాలకు మహాకుంభాభిషేకాన్ని నిర్వహించాలని ఈఓను కోరారు. మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీవారి సురేష్, ప్రసాద్ ఈశ్వర్‌సాయి పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ రేపు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని చల్లమాంబపురం, కాటూరు, కనమనంబేడు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తామని, మండలంలోని పార్టీ శ్రేణులు, అనుబంధ విభాగాల కమిటీ సభ్యులు హాజరు కావాలని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కొణతనేని మణినాయుడు తెలిపారు. సమావేశానికి సత్యవేడు నియోజక సమన్వయకర్త నూకతోటి రాజేష్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు.

విలీనం ఆపాలని ఆందోళన



పాఠశాల వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు, విద్యార్థులు

సత్యవేడు: గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విలీనాన్ని ఆపాలని వీఆర్ కండ్రిగ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేశారు. మంగళవారం పాఠశాలలో, సత్యవేడు–ఊత్తుకోట రోడ్డుపై బైఠాయించి ఆందోళన నిర్వహించారు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలోని మదనంబేడు పాఠశాలలో విలీనం ఆపాలని సర్పంచ్ ఎస్.సుజాత కోరారు. అనంతరం ఎంఈఓ కె.రవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సుబ్రమణ్యంరాజు, రాజేంద్రన్, జగదీష్, వినోద్, సుందరి, రేఖ, సురేష్, ఢిల్లీరాణి, ఆశ పాల్గొన్నారు

పరశురామేశ్వర సేవలో మంత్రి దుర్గేష్

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లంలో వెలసిన భారతదేశంలోనే అతి పురాతన శైవక్షేత్రం ఆనందవల్లీ దేవి సమేత పరశురామేశ్వరస్వామిని మంగళవారం రాష్ట్ర టూరిజం శాఖ మంత్రి కందుల దుర్గేష్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈఓ రామచంద్రారెడ్డి, సిబ్బంది ప్రత్యేక దర్శనం చేయించారు. ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు, ఆలయ అర్చకులు పవన్ కుమార్ శర్మ పాల్గొన్నారు. అదేవిధంగా మంత్రి శ్రీకాళహస్తీశ్వ రాలయాన్ని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు.

శివయ్యను దర్శించుకున్న గాలి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరుని మంగళవారం బీజేపీ నాయకుడు గాలి జనార్ధన్‌రెడ్డి దర్శించుకున్నాడు. కుటుంబ సమేతంగా విచ్చేసిన ఆయనకు ఆలయ ఏఈఓ మోహన్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం చేయించారు. అనంతరం మృత్యుంజయలింగం వద్ద స్వామి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఛీ..నామినేటెడ్ పోస్టులు

- నైరాశ్యంలో తెలుగు తమ్ముళ్లు
- అన్నిచోట్లా నియామకాలు.. సత్యవేడులో ఊసే లేదు
- నియామకంలో జాప్యం
- ఎవరి సిఫార్సులకు పదవులు వరించేనో?



వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం



నాగలాపురంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం

వరదయ్యపాళెం: రాష్ట్ర వ్యాప్తంగా అధికార కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవులు పందేరం చేస్తోంది. ఆ దశగా తిరుపతి జిల్లాలో కూడా సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జులతో కమిటీల నియామకం, మార్కెట్ కమిటీలకు పాలక మండలి చైర్మన్లను నియమించారు. అయితే సత్యవేడు నియోజకవర్గంలో మాత్రం నామినేటెడ్ పదవుల పందేరం జరగలేదు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు దశల్లో నామినేటెడ్ పదవుల పందేరం జరిగినప్పటికీ సత్యవేడు నియోజకవర్గ కూటమి నేతలకు మాత్రం నిరాశే మిగిలింది. ఇప్పటి దాకా నియోజకవర్గంలో ఒక్క నామినేటెడ్ పదవి కూడా భర్తీ కాలేదు. అధికారం చేపట్టిన కొత్తలో నియోజకవర్గంలో ఉన్న నామినేటెడ్ పదవులకు పలువురు పైరవీలకు పోటీ పడ్డారు. అయితే ఎంతో ఆత్రుతగా ఎదురుచూసిన ఆశావహులకు ఏడాది కాలంగా నిరాశే మిగిలింది. దీంతో కూటమి ప్రభుత్వ తీరుపై లోలోపల ఆశావహులు రగిలిపోతున్నారు.

ఎవరి సిఫార్సులకు పదవులు వరించేనో?

అయితే ప్రస్తుతం నియోజకవర్గ టీడీపీలో విభిన్న పరిస్థితులు నెలకొన్నాయి. అధికార సిట్టింగ్ ఎమ్మెల్యేపై టీడీపీ అధిష్టానం సస్పెన్షన్ వేటు వేసింది. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యేను అధికారిక కార్యక్రమాలకు మినహాయిస్తే పార్టీ కార్యక్రమాల్లో ఆయన ప్రమేయం లేకుండా చేసింది. ఆ దిశగా టీడీపీ అధిష్టానం చర్యలు తీసుకుంది. గతంలో ఇద్దరిని పరిశీలకులుగా, సమన్వయకర్తగా నియమించింది. తాజాగా ఆ ఇద్దరిని పక్కన పెట్టి నియోజకవర్గ పార్టీ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్‌గా తిరుపతికి చెందిన వ్యాపారవేత్త శంకర్‌రెడ్డిని నియమించింది. అయితే ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే ఆదిమూలంకు, నియోజకవర్గ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్‌గా నియమితులైన శంకర్‌రెడ్డికి మధ్య ఉన్న అనుబంధంతో వీరిద్దరూ ఏకతాటిపై పనిచేస్తారని టీడీపీ శ్రేణులు ఎంతో ఆత్రుత పడ్డారు. అంతేకాక ఇకపై వర్గాలు లేకుండా ఒకటిగా ఉంటారని ఊహించారు. అయితే వారి ఆలోచనలకు భిన్నంగా పరిస్థితులు చకచకా మారిపోయాయి. ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్‌గా నియమితులైన 10 రోజులకే ఆయన తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహంతో ఊగిపోయారు. గత సార్వత్రిక ఎన్నికల్లో తనకు చెడు చేసి టీడీపీ నియోజకవర్గంలో ఓడిపోవాలని సంకల్పించిన వారిని వెంటబెట్టుకుని తిరగడం పట్ల ఎమ్మెల్యే ఒక్కసారిగా ఆగ్రహంతో ఊగిపోయారు. ఏకంగా రిజర్వుడ్ నియోజకవర్గమైన సత్యవేడులో ఎంత మంది పెత్తనం చెలాయిస్తారని బహిరంగంగానే ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధంగా గెలుపొందిన నేను నియోజకవర్గానికి అధికారిక ఎమ్మెల్యే అని అధికారులు సైతం తన వెంటే నడవాలని, ఎలాంటి రాజ్యాంగబద్ధమైన పదవులు లేని కో–ఆర్డినేటర్ల వెంట నడిస్తే వారిపై చట్టపరమైన చర్యలకు వెనుకాడబోమని అధికారులకు సైతం ఎమ్మెల్యే హెచ్చరికలు జారీ చేశారు. ఈ పరిస్థితులతో నియోజకవర్గ టీడీపీలో ఒక్కసారిగా రాజకీయం వేడెక్కింది. అయితే ప్రస్తుతం నామినేటెడ్ పదవులు కావాలన్న ఆశావహులు ఎవరి సిఫార్సు ద్వారా ముందుకెళ్లాలన్నది ప్రశ్నార్థకమవుతోంది. పార్టీ అధిష్టానం నియమించిన ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి సిఫార్సు పనిచేస్తుందా? లేక సస్పెన్షన్‌కు గురైన సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలం సిఫార్సు పనిచేస్తుందా అనే సందిగ్ధంలో ఆశావహులు ఉన్నారు.

నియోజకవర్గంలో నామినేటెడ్ పదవులు ఇవే

నియోజకవర్గ వ్యాప్తంగా 7 మండలాల్లో 7 సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జులతో కమిటీలు నియమించాల్సి ఉంది. అలాగే బీఎస్‌కండ్రిగ, నాగలాపురం మార్కెట్ యార్డులకు చైర్మన్‌లను నియమించాల్సి ఉంది. సురుటుపల్లి ఆలయానికి పాలక మండలిని నియమించాల్సి ఉంది.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు



వెంచర్‌లో శుభ్రం చేయిస్తున్న సీఐ

ఏర్పేడు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే వారిపై చర్యలు తీసుకుంటామని ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. ఏర్పేడు సమీపంలోని ఓ ప్రైవేటు వెంచర్‌లో ఆయన సిబ్బందితో కలిసి వెళ్లి అక్కడ వేసిన మందుబాటిళ్లు, చెత్త, చెదారాన్ని పారిశుద్ధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. ఎవరైనా బహిరంగంగా మద్యం తాగితే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

మోతాదుకు మించి వాడకండి

నారాయణవనం: రసాయన ఎరువులు మోతాదుకు మించి వాడకుండా భూమిని రక్షించుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు. మండలం సముదాయంలో పీఎం ఆర్కేవీవై పథకంలో భాగంగా మంగళవారం రైతు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు, పుత్తూరు డివిజన్ ఏడీఏ లక్ష్మీదేవి, మండలం వ్యవసాయ అధికారి శోభారాణి, సర్పంచ్ సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

పల్లె నిద్రలో పోలీసులు



మాట్లాడుతున్న రూరల్ సీఐ

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం హరిజనవాడలో మంగళవారం రాత్రి రూరల్ సీఐ మంజునాథరెడ్డి పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులతో సమావేశమై స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనుమానితులు గ్రామంలో సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



చంద్రప్రభ వాహనంపై వీరభద్రస్వామి

నారాయణవనం: స్థానిక టీటీడీ అనుబంధ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజులపాటు నిర్వహించే ఉత్సవాలకు మంగళవారం ఉదయం అంకురార్పణ నిర్వహించారు. సాయంత్రం వీరఖడ్గ చిత్రపటమున్న వస్త్రాన్ని ధ్వజస్తంభానికి అధిరోహింప జేశారు. అనంతరం స్వామి వారు చంద్రప్రభ వాహనం అధిరోహించి పురవీధుల్లో విహరించారు. టీటీడీ ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు పాల్గొని పర్యవేక్షించారు. బుధవారం సాయంత్రం సింహవాహనాన్ని అధిరోహించి ఊరేగింపులో వీరభద్రస్వామి దర్శనమిస్తారని నాగరాజు తెలిపారు.

సొరకాయలస్వామి ఆరాధనోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో సొరకాయలస్వామి

నారాయణవనం: నారాయణవనంలోని సొరకాయలస్వామి జీవసమాధి 123వ మహా గురుపూజ ఆరాధనోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పది రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు ప్రత్యేక అభిషేకాలు, మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఉభయదారులతో అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ పేర్కొంది. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం సహస్ర కలశాలను స్థాపించి ప్రత్యేక హోమాలు, అనంతరం ఉభయదారులతో మూలవర్లకు కలశ జలాలతో అభిషేకం నిర్వహించారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం జెడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్ ప్రత్యేక అర్చనలో పాల్గొన్నారు. సాయంత్రం పుష్పపల్లకీపై సొరకాయల స్వామి ఉత్సవమూర్తిని ఉంచి, గ్రామ వీధుల్లో ఊరేగించారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

వరదయ్యపాళెం: బాల్య వివాహాలు పలు అనర్థాలకు కారణమవుతాయని చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రశాంత్ తెలిపారు. ఆ మేరకు మంగళవారం సత్యవేడు మండలం పీవీపురం హైస్కూల్‌లో విద్యార్థులకు బాల్య వివాహాల వల్ల కలిగే ఇబ్బందుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం అనర్థాలపై పోస్టర్లను ఆవిష్కరించారు. ఎంపీహెచ్‌ఈఓ రవీంద్రుడు, సూపర్‌వైజర్ పవనకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ లోకేశ్వరి, ఆశా వర్కర్లు సుమతి, పళ్లెమ్మ పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలకు రుణాలు



డ్వాక్రా మహిళలకు చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే

నారాయణవనం: మండల మహిళా సమైక్య (వెలుగు) కార్యాలయంలో డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.23.25 కోట్ల బ్యాంకు లింకేజీ, శ్రీనిధి రుణాల జంబో చెక్కును సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం అందజేశారు. జెడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్, ఎంపీడీఓ అరుణ, వెలుగు ఏపీఎం ధనంజయరెడ్డి, మండల వ్యవసాయ అధికారి శోభరాణి, ఏపీఓ సుకన్య, శ్రీనిధి మేనేజర్ ఆదిల్ బాషా, సీసీలు నాగేంద్రరావు, అరుణ్‌కుమార్, నిమ్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం మూత

రేణిగుంట: మండలంలోని 19 పంచాయతీలకు సంబంధించి స్థానిక పంచాయతీ కార్యాలయం మిద్దెపైన ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆధార్ అప్‌డేట్ బాధ్యతలను సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌కు అప్పగించారు. 110 గ్రామాల్లోని ప్రజలు ఆధార్ అప్‌డేట్ కోసం క్యూ కట్టడంతో సచివాలయ విధులు నిర్వహించి ఆధార్ అప్‌డేట్ చేయలేక డిజిటల్ అసిస్టెంట్ కనీసం వారం రోజులు తిప్పుకుంటున్నారు. అదీకాక ప్రస్తుతం డిజిటల్ అసిస్టెంట్ వైజాగ్‌లో శిక్షణకు వెళ్లడంతో మంగళవారం నుంచి శనివారం వరకు ఆధార్ సేవలను బంద్ చేశారు. అప్‌డేట్ చేసుకుందామని వస్తున్న ప్రజలు కార్యాలయం మూసి ఉండడం చూసి వెనుదిరుగుతున్నారు. వివరణ కోరేందుకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రభురావును ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

వాల్‌చార్ట్స్ అందజేత



వాల్‌చార్ట్స్ ఇస్తున్న బత్తెయ్యనాయుడు

శ్రీకాళహస్తి: పట్టణం 16వ వార్డులోని మున్సిపల్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ప్రియాంక గాంధీ సంఘటన స్టేట్ ప్రెసిడెంట్ షేక్ కరీముల్లా పాఠశాలకు వాల్‌చార్ట్స్ పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేత డాక్టర్ బత్తయ్యనాయుడు పాల్గొని వాల్‌చార్ట్స్‌ను పాఠశాల సూపర్‌వైజర్ చంద్రశేఖర్ యాదవ్‌కు అందజేశారు. షేక్ కరీముల్లా, సయ్యద్ జిలానీ బాషా, నాగూరయ్య, శివయ్య, షేక్. నిజాముద్దీన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న డీఎస్పీ

రేణిగుంట: మండలంలోని మల్లవరం పాఠశాలలో రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలు, వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రేమ పేరుతో మోసాలు, బాల్యవివాహాలు, మహిళలపై జరిగే నేరాలు, ఇతర చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించామని ఆయన తెలిపారు. ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి, ట్రైనీ ఎస్‌ఐ స్వాతి, హెచ్‌ఎం వెంకటరమణ, టీచర్లు, పోలీసులు పాల్గొన్నారు.

చెత్త సేకరణకు 30 తోపుడు బండ్లు



బండ్లను పరిశీలిస్తున్న డీపీఓ

రేణిగుంట: స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రేణిగుంట మేజర్ పంచాయతీలో చెత్త సేకరణకు 30 తోపుడు చెత్త బండ్లను కొనుగోలు చేశారు. వీటిని మంగళవారం డీపీఓ సుశీలాదేవి పరిశీలించారు. చెత్త సేకరణలో తీసుకోవలసిన చర్యలపై పంచాయతీ అధికారులకు సూచనలు చేశారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విష్ణు చిరంజీవి, ఈఓ మాధవి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

చెత్త బండ్లు ప్రారంభం

పంచాయతీలో చెత్త సేకరణ కోసం కొత్తగా కొనుగోలు చేసిన 30 తోపుడు బండ్లను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి మంగళవారం ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని బీసీ హాస్టల్‌ను పరిశీలించారు. ఈఓ మాధవి, సర్పంచ్ నగేశం, హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వర్లు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో జేఎన్‌టీయూ వీసీ



ఆలయం వద్ద వీసీ సుదర్శనరావు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సుదర్శనరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధిలో వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించి స్వామి అమ్మవారి జ్ఞాపిక అందజేశారు.

ట్రాఫిక్‌పై వాహనదారులకు అవగాహన



వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్డుపై వాహనాలను నిలపరాదని సీఐ తిమ్మయ్య వాహనదారులకు సూచించారు. ఆయన మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగలోని మెయిన్‌రోడ్డుపై నిలిపిన వాహనాదారులకు, ఆటోవాలాలకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాహనాలను మెయిన్‌రోడ్డులో నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌ఐ విశ్వనాధనాయుడు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఘనంగా సత్యమ్మ జాతర



భక్తులను కటాక్షిస్తున్న సత్యమ్మ



సారె తీసుకొస్తున్న భక్తులు

రేణిగుంట: స్థానిక భగత్‌సింగ్ కాలనీలోని శ్రీ సత్యమ్మకు మంగళవారం ఉదయం భక్తులు అభిషేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు, సీఆర్‌ఎస్ రైల్వే మజ్దూర్ యూనియన్ చైర్మన్ సదాశివరెడ్డి ఇంటి నుంచి అమ్మవారికి ఊరేగింపుగా సారె తీసుకొచ్చి సమర్పించారు. అభిషేకం అనంతరం సత్యమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామ ఎల్లదేవతలకు పూజలు నిర్వహించిన అనంతరం హారతి ఇచ్చారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ఆవరణలో అమ్మవారికి అంబలి, పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. అదేవిధంగా రేణిగుంట గ్రామ దేవత ఎల్లమ్మకు రెండు రోజులు పాటు జరిగే జాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. విశేషాలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

బ్యాంకు మేనేజర్లతో సమావేశం



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

రేణిగుంట: రేణిగుంట, ఏర్పేడు మండలాల్లోని అన్ని బ్యాంకుల మేనేజర్లతో మంగళవారం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసరావు సమావేశం నిర్వహించారు. బ్యాంకుల భద్రతా పరిరక్షణ, సెక్యూరిటీ మేనేజ్‌మెంట్, సీసీ కెమెరాల ఏర్పాటు, అలారమ్ వ్యవస్థలు, నైట్ సెక్యూరిటీ గార్డుల వినియోగం వంటి కీలక అంశాలపై చర్చించారు. భవిష్యత్‌లో బ్యాంకుల్లో ఎలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు తగిన సూచనలు చేశారు. పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకుల్లో భద్రతా ప్రమాణాల పరిశీలన



ఎస్‌బీఐ బ్యాంకులో పరిశీలిస్తున్న సీఐ

ఏర్పేడు: స్థానికంగా ఉన్న బ్యాంకుల్లో చేపట్టిన భద్రతా చర్యలను మంగళవారం ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకులను ఆయన సిబ్బందితో కలిసి సీసీ కెమెరాలను పరిశీలించారు. బ్యాంకు నిబంధనల మేరకు ఖాతాదారుల రక్షణకు తీసుకోవాల్సిన భద్రతా చర్యల గురించి ఆయా బ్యాంకు మేనేజర్లతో చర్చించారు. ఎస్‌బీఐ మేనేజర్ గిరిజ, యూనియన్ బ్యాంకు మేనేజర్ పాండుబాబు, సప్తగిరి బ్యాంకు మేనేజర్ టి.దినేష్, ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పుస్తకాల్లేని చదువులు

- పిల్లలకు అందని పాఠ్యపుస్తకాలు
- ఎఫ్ఏ-1 పరీక్ష సమీపిస్తున్నా పుస్తకాల కొరత
- చేతులెత్తేసిన విద్యాశాఖ
- కుంటుబడుతున్న బోధనాభ్యసన ప్రక్రియ



ఏర్పేడు ఎంఈఓ కార్యాలయం



పాఠ్యపుస్తకాలు

ఏర్పేడు: 'గత ప్రభుత్వంలో పాఠశాల ప్రారంభించిన తొలిరోజే కొరత లేకుండా పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, స్కూల్ యూనిఫాం, టై, బెల్ట్, షూలు, బ్యాగు వంటి విద్యాసామగ్రి కిట్లను అందించారు. ట్యాబ్‌లు, డిజిటల్ బోర్డులు, వీడియో పాఠాలు, టోఫెల్ కరికులం వంటి ఎన్నో మహత్తర కార్యక్రమాలతో విద్యరంగం ఓ స్వర్ణయుగంలా సాగింది. నాడు–నేడుతో స్కూళ్ల రూపురేఖలు మారాయి. కార్పొరేట్ పాఠశాలలకు ఏ మాత్రం తీసిపోని రీతిలో సర్కారు బళ్లు బలోపేతమయ్యాయి. అయితే ఇదంతా గతం.. ప్రస్తుతం పేద విద్యార్థులకు కనీసం పాఠ్యపుస్తకాలు కూడా సక్రమంగా ఇవ్వలేని గడ్డుకాలం నడుస్తోంది. దీంతో సర్కారు బడుల్లో చదివే పిల్లలు పాఠ్యపుస్తకాలు లేకపోవడంతో తరగతి గదిలో ఉపాధ్యాయుడు చెప్పిన పాఠ్యాంశాలను 'ఊహాభ్యాసనం' ద్వారా నేర్చుకునే దుస్థితి ఏర్పడింది. ఈ ఏడాది ప్రారంభంలోనే విద్యార్థులకు కొన్ని సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలు పూర్తిగా రాలేదు. దీనికితోడు కొత్తగా చేరిన విద్యార్థులకు ఒక్క పుస్తకం కూడా ఇవ్వలేదు. పాఠ్యాంశాలను బోధించే ఉపాధ్యాయులకు ఒక సెట్ పాఠ్యపుస్తకాలు గతంలో ఇచ్చేవారు. అయితే ఈ సారి అవి కూడా ఇవ్వకపోవడంతో గత ఏడాది నాటి పుస్తకాలనే భద్రపరుచుకుని ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. విద్యార్థుల ఆధార్ నంబర్ అనుసంధానంగా పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. కొరత ఉన్న చోట్ల ఇండెంట్ కోసం అభ్యర్థనలు పంపినా విద్యాశాఖ పట్టించుకోలేదు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లల చదువులు కుంటుబడుతున్నాయి.

కొత్తగా చేరిన వాళ్లకు కొరత:

కొత్తగా చేరిన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు కొరత ఏర్పడింది. కొరత ఉన్న పాఠశాలల నుంచి వివరాలను తీసుకుని పాఠ్యపుస్తకాల కోసం ఇండెంట్ పంపాం. త్వరలోనే అవసరమైన అన్ని పాఠ్యపుస్తకాలు అందగానే పంపిణీ చేస్తాం.

– దయాకర్‌రావు, ఎంఈఓ–2 ఏర్పేడు.